నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | నల్లగొండ, సోమవారం 19 మే 2025 | YADADRI BHUVANAGIRI

భువనగిరి ఖిలా అభివృద్ధి పనులకు టెండర్

యాదాద్రి భువనగిరి, మే 18 (నమస్తే తెలంగాణ) : భువనగిరి ఖిలా అభివృద్ధిలో కదలిక వచ్చింది. పురోగతి పనులకు ముందడుగు పడింది. కోట సివిల్ పనుల కోసం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ టెండర్ నోటీసు ఇచ్చింది. ఈ నెల 17న నమస్తే తెలంగాణలో ప్రచురితమైన 'భువనగిరి ఖిలా.. అభివృద్ధి డీలా'' అనే కథనానికి సదరు సంస్థ స్పందించింది. ఈ నెల 17న ఇ – ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ విడుదల చేసింది. ఈపీసీ విధానం కింద భువనగిరి పోర్ట్ వద్ద భువనగిరి ఎక్స్‌పెరిమెంటల్ జోన్ (సివిల్ ఇంజినీరింగ్ పనులు) డిజైన్, అభివృద్ధి కోసం స్వదేశ్ దర్శన్ 2.0 కింద ఏజెన్సీని ఎంపిక కోసం ప్రతిపాదిస్తున్నట్టు అందులో పేర్కొంది. పనుల అంచనా వ్యయం రూ.37.39 కోట్లుగా పొందుపరిచింది. ఈ నెల 20వ తేదీన బిడ్ డాన్ లోడింగ్ ప్రారంభం అవుతుందని స్పష్టం చేసింది. అర్హులైన కాంట్రాక్టర్ల నుంచి ఇ – ప్రొక్యూర్మెంట్ ప్లాట్ ఫామ్‌పై బిడ్స్ కోరుతున్నట్లు తెలిపింది. మరిన్ని వివరాలకు www.tender. telangana. gov.in అనే వెబ్ సైట్ లో ఇ –ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చని సూచించింది.

అవి 'నీటి' శాఖ!

సూర్యాపేట జిల్లా నీటి పారుదల శాఖలో అక్రమాలు

ఉన్నతాధికారుల నుంచి ఉద్యోగుల వరకు చేతివాటం

- కాల్వల నీళ్లు మళ్లించి రైతుల నుంచి డబ్బులు వసూలు
- చెరువుల మట్టి అమ్ముకొని ధనార్జన
- సొంత వాహనాలకే అద్దె వాహనాల బిల్లు
- అనుమతి లేకున్నా విధులకు డుమ్మా
- సొంత శాఖపైనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సిబ్బంది

సూర్యాపేట నీటి పారుదల శాఖలో అవినీతి రాజ్యమేలుతున్నది. కొంత మంది అధికారులు, ఉద్యోగులు అడ్డూఅదుపు లేకుండా ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాల్వలు మూసి కొన్ని ప్రాంతాలకే నీటిని పంపి రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు, చాలా చోట్ల చెరువుల్లో మట్టిని అమ్ముకుంటూ లక్షలాది రూపాయలు అక్రమార్జన చేస్తున్నట్లు ఆ శాఖకు చెందిన కింది స్థాయి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కార్యాలయానికి చుట్టపుచూపుగా వచ్చి వెళ్తుంటారని, అద్దె వాహనాలు లేకున్నా సొంత వాహనాలకే బిల్లులు తీసుకుంటున్నారని తెలుస్తున్నది. అధికారులు, ఉద్యోగుల అవినీతిపై ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత జిల్లాలోనే ఇలాంటి దుస్థితి ఉందంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

– సూర్యాపేట, మే 18 (నమస్తే తెలంగాణ)

సూర్యాపేటలోని ఇరిగేషన్ కార్యాలయం

ఉమ్మడి రాష్ట్రంలో చుక్కనీటికి ఎరుగని లక్షలాది ఎకరాల బీడు భూములకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి సాగు జలాలు ఇస్తే రైతులు సిరుల పంటలు పండించే స్థాయికి వచ్చారు. కానీ ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో నీళ్లు రాక మళ్లీ పంటలు ఎండడం, బీళ్లుగా మారడంతో రైతులు బోరుమంటున్నారు. ప్రభుత్వ నిర్వాకం అలా ఉంటే ఇరిగేషన్ అధికారుల అవినీతికి అంతే లేకుండా పోయింది. దీంతో రైతులకు మరిన్ని ఇక్కట్లు తప్పడం లేదు. యాసంగిలో కాల్వకు వస్తున్న నీటిని కొన్ని చోట్ల షట్టర్లు క్లోజ్ చేసి వేరే ప్రాంతాలకు తరలించడానికి ఇరిగేషన్ ఉద్యోగులు, సిబ్బంది డబ్బులు తీసుకున్నారని ఆరోపిస్తూ నీళ్లు అందక ఎండిన పంట పొలాల రైతులు ఆందోళనలకు దిగిన విషయం విదితమే. ఇక ఇరిగేషన్ అధికారులు, ఉద్యోగుల అవినీతిని ఆ శాఖకు చెందిన కింది స్థాయి ఉద్యోగులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ శాఖలో రచ్చరచ్చగా మారింది.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కార్యాలయంతోపాటు డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇటీవల అదే శాఖకు చెందిన కొంతమంది ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌కు 13 అంశాలతో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. జిల్లాలోని డీఈఈ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు అవినీతికి పాల్పడుతున్నారని, ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులోని అంశాలు..

- డీఈఈ ఎం.సత్యనారాయణ ప్రైవేట్ అద్దె వాహనం లేకుండా ప్రతినెలా తెలిసిన వాళ్ల పేరిట బిల్లు తీసుకుంటున్నారు.
- ఏఈ అమర్, ఎన్ఎంఆర్ నరేశ్ రెడ్డి కలిసి ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్ వెలిశాల దగ్గర మట్టిని అమ్ముకొని అవినీతికి పాల్పడుతున్నారు. తిరుమలగిరి చెరువు మట్టిని ఇటుక బట్టి వ్యాపారులకు అమ్ముకున్నారు. వీళ్లు జీతాల బిల్లుల్లో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్ఎంఆర్ సాలరీ బిల్లుల కాంట్రాక్ట్‌ను ఏఈ అమర్ ఫ్రెండ్‌కు ఇచ్చి అవినీతికి పాల్పడుతున్నారు.
- సూర్యాపేట ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈఈ పిచ్చయ్య ప్రైవేట్ అద్దె వాహనం లేకుండా ప్రతి నెలా బిల్లు తీసుకుంటున్నారు. ఇతను హైదరాబాద్ నుంచి వారానికి ఒకటి రెండు సార్లు మాత్రమే కార్యాలయానికి వస్తారు.
- జూనియర్ అసిస్టెంట్ ఎం.సంగీత కూడా హైదరాబాద్ నుంచి వారానికి ఒక్కసారి మాత్రమే వస్తారు.
- మరో జూనియర్ అసిస్టెంట్ ఎం.ప్రదీప్‌కుమార్ రామన్నపేట నుంచి 12 గంటలకు వచ్చి 3 గంటలకు వెళతారు.
- ఇంకో సీనియర్ అసిస్టెంట్ పరశురాములు మిర్యాలగూడ నుంచి వారానికి రెండు సార్లు మాత్రమే వస్తారు.
- తుంగతుర్తి ఇరిగేషన్ సబ్ డివిజన్ జూనియర్ అసిస్టెంట్ ఎండీ జహీర్ మహబూబాబాద్ నుంచి వస్తారు.
- నాగారం ఇరిగేషన్ సబ్ డివిజన్ జూనియర్ అసిస్టెంట్ రాకేశ్‌కు మార్ విధులకు డుమ్మా కొడుతూ ఇంట్లోనే ఉండి సొంత పనులు చేసుకుంటారు.
- ఇరిగేషన్ సబ్ డివిజన్ తిరుమలగిరి కార్యాలయాన్ని రూల్స్‌కు విరుద్ధంగా పెంట్ హౌస్‌లో పెట్టి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు.

మొత్తం మీద కార్యాలయంలో ఎవరి అజమాయిషీ లేదని, ఎవరి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ దానిని జిల్లా ఇరిగేషన్ అధికారికి ఫార్వార్డ్ చేశారు. ఈ విషయమై ఐబీ సీఈ రమేశ్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

13 అంశాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు

మిస్సింగ్‌ల కలకలం..!

చౌటుప్పల్‌లో వరుసగా 'అదృశ్యం' కేసులు

- కేసుల్లో అధికంగా యువతులు, మహిళలే..
- ప్రేమ, కుటుంబ కలహాలే అంటున్న పోలీసులు
- తమవారు ఎలా ఉన్నారోనని పేరెంట్స్ టెన్షన్
- పోలీసులకు సవాల్‌గా మారిన మిస్సింగ్స్

సాధారణంగా ఏ మండలంలోనైనా అదృశ్యం కేసులు అరుదుగా నమోదవుతుంటాయి. నెలకు రెండు, మూడు కేసులకు మించి ఎఫ్ఐఆర్ రికార్డు అయ్యే పరిస్థితి ఉండదు. కానీ యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్‌లో మాత్రం మిస్సింగ్ కేసులకు అంతే లేకుండా పోతున్నది. ఇక్కడ 'అదృశ్యం' ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నది. అసలు 'కనబడుటలేదు' అనే కేసులు ఎందుకు అధికంగా నమోదు అవుతున్నాయి..? ఏదైనా మిస్సింగ్స్ మిస్టరీ ఉందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– యాదాద్రి భువనగిరి, మే 18 (నమస్తే తెలంగాణ)

యాదాద్రి భువనగిరి జిల్లాలో చౌటుప్పల్ ఓ కీలకమైన మండలం. చౌటుప్పల్ పట్టణం మున్సిపాలిటీ పరిధిలో ఉంది. మండలంలో సుమారు 80 వేల మంది వరకు జనాభా ఉంటుంది. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. మండల వ్యాప్తంగా పెద్ద పెద్ద ఇండస్ట్రీలు, కంపెనీలు ఉన్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల ఉద్యోగులు, కార్మికులు ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. చౌటుప్పల్ డివిజన్ కావడంతో ఆర్డీఓ కార్యాలయం, ఏసీపీ ఆఫీస్ కూడా ఉంది.

వారంలో వరుసగా కేసులు..

చౌటుప్పల్ పట్టణం, రూరల్‌లో కొంత కాలంగా మిస్సింగ్ కేసులు విపరీతంగా నమోదవుతున్నాయి. టౌన్ లేదా రూరల్‌లో అదృశ్యం కేసులకు పుల్‌స్టాప్ పడటంలేదు. దీని పరిధిలో వారంలో వరుసగా కేసులు నమోదవుతున్నాయి. కొన్ని రోజులపాటు నిత్యం 'చౌటుప్పల్‌లో అదృశ్యం' అనే వార్తలు న్యూస్ పేపర్లు, సోషల్ మీడియాలో నిరంతరాయంగా వచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే ఇవి ఎఫ్ఐఆర్ నమోదైనవి మాత్రమే. కేసులు నమోదు కానివి మరికొన్ని సంఘటనలు ఉన్నట్లు తెలుస్తున్నది. కేసుల వివరాలు ఇవ్వడానికి పోలీసులు నిరాకరిస్తున్నారు.

అధికంగా యువతులు, మహిళలే..

మిస్సింగ్ కేసుల్లో అధికంగా యువతులు, మహిళలే ఉన్నారు. అది కూడా 18 నుంచి 40 ఏండ్ల మధ్య వయసున్న వారే కనిపించకుండా పోతున్నారు. కొన్ని సందర్భాల్లో మైనర్లు సైతం అదృశ్యమవుతున్నారు. తక్కువ కేసుల్లో మాత్రమే పురుషులు ఉంటున్నారు. ప్రేమ, పెండ్లి వ్యవహారం, వివాహేతర సంబంధం, కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. అయితే ఇవే కారణాలా..? మరే ఇతర కోణం ఉందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా లవ్, వివాహేతర, కుటుంబ గొడవలు కేవలం ఇక్కడ మాత్రమే జరుగుతున్నాయా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి.

పోలీసులకు సవాల్..

చౌటుప్పల్ పోలీసులకు మిస్సింగ్ కేసులు సవాలుగా మారుతున్నాయి. ఎఫ్ఐఆర్‌ల సంఖ్య పెరిగిపోతుండటం పోలీసులను టెన్షన్ పెడుతున్నది. కొన్ని కేసులు పరిష్కారమవుతున్నా.. మరికొన్ని తేలకుండానే మిగిలిపోతున్నాయి. దీంతో తమవారు ఎక్కడున్నారో..? ఎలా ఉన్నారో తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతూ ఆరా తీస్తున్నారు. ఏవేవో కారణాలు చెబుతూ పోలీసులు మాత్రం మిస్సింగ్ కేసులను తేలికగా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాజా కేసులు ఇలా..

మే 12 : చౌటుప్పల్ మండలంలోని పీపల్ పహాడ్‌కు చెందిన ఓ యువతి (21ఏండ్లు) డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఉంటున్నది. సాయంత్రం ఇంటికి వచ్చిన తండ్రి కుమార్తె లేకపోవడం గమనించాడు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు, బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మే 7 : మండలంలోని ఖైతాపురం గ్రామానికి చెందిన ఓ యువతి (24) బీటెక్ పూర్తి చేసి ఉంట్లోనే ఉంటున్నది. తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులు కంప్లయింట్ ఇవ్వడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు

కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

వలిగొండ, మే 18 : ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చూడాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని సంగెం ఐకేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, నాణ్యతగా ఉన్న ధాన్యాన్ని తూకాలు వేయించి త్వరితగతిన మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం రవాణాలో లారీల యజమానులతో మాట్లాడి నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతోపాటు ఏపీఎం ఝాన్సీ, రెవెన్యూ అధికారి కరుణాకర్ రెడ్డి, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు ఉన్నారు.

స్టోర్ రూములో కాలిబూడిదైన మందులు

నిడమనూరు పీహెచ్‌సీలో అగ్నిప్రమాదం

- భవనంలో సామగ్రి, మందులు దగ్ధం
- షార్ట్ సర్క్యూటే కారణం..
- సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం

నిడమనూరు, మే 18 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత స్టోర్ రూములో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు లేచి సామగ్రికి అంటుకున్నాయి. మంటలు పెద్దఎత్తున వ్యాపించి దట్టమైన పొగ కమ్ముకోవడంతో గమనించిన వాచ్‌మన్ ఉదయరాజ్ వైద్యాధికారికి సమాచార మందించాడు. అప్పటికే ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న మంటల్లో స్టోర్ రూములో నిల్వ చేసిన మందులు, భవనంలోని ఐఎల్ఆర్ ఫ్రిజ్‌లు, రిఫ్రిజిరేటర్లు, బెడ్లు, కంప్యూటర్లు, ప్రింటర్లు, డాక్యుమెంట్లకు నిప్పంటుకొని కాలి బూడిదయ్యాయి. అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న ఏఎస్ఐ కోడిరెక్క జోజి హుటాహుటిన ఆరోగ్య కేంద్రం భవనం వద్దకు చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే పూర్తి స్థాయిలో విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైంది. జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు అర్ధరాత్రి ఆరోగ్య కేంద్రం వద్దకు చేరుకున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ కేసా రవి ప్రమాదం తీరును పరిశీలించారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 5 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు వైద్యాధికారి అరవింద్ తెలిపారు. అగ్ని ప్రమాదం కారణంగా ఆదివారం ఉదయం ఆరోగ్య కేంద్రం ఆవరణలోనే చెట్ల కింద సిబ్బంది విధులు నిర్వహించారు. ప్రమాద ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జోజి తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డిబార్

రామగిరి, మే18 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో ఆదివారం 8 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా స్క్వాడ్ అధికారులు డిబార్ చేశారు. ఉదయం జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షలో నల్లగొండ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, హాలియా సృజన డిగ్రీ కళాశాలలో ఇద్దరు, దేవరకొండలో ఒకరు.. మధ్యాహ్నం జరిగిన ఒకటో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలో దేవరకొండ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, మాల్‌లోని డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లు ఎంజీయూ పరీక్షలు నియంత్రణ అధికారి జి.ఉపేందర్ రెడ్డి తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌ల నిర్వహణ

- నల్లగొండ జిల్లాలో 11 మందిపై కేసు నమోదు

నీలగిరి, మే18 : నల్లగొండ జిల్లాలో నకిలీ వైద్యులుగా చలామణి అవుతున్న 11మందిపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. పలు మెడికల్ షాపుల పేరుతో క్లినిక్ నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో గత సంవత్సరం రెండు దఫాలుగా జిల్లాలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. జిల్లాలో పలు అసుపత్రుల్లో కంపౌండర్లుగా పనిచేసి టీఎస్ఎంఏఆర్ నిబంధనలకు విరుద్ధంగా డాక్టర్ల వేషధారణతో వైద్యం చేస్తున్నట్లు, ఆర్ఎంపీలు, పీఎంపీలు కొంత మంది మెడికల్ దుకాణాల పేరుతో లైసెన్స్‌లు తీసుకుని తమ అర్హతకు మించి శస్త్ర చికిత్సలకు వినియోగించే పలు రకాల అనుమతులు లేని మందులు వాడుతున్నట్లు గుర్తించారు. దాంతో వారు నిర్వహిస్తున్న క్లినిక్‌లను సీజ్ చేసి విచారణ చేపట్టారు. తాజాగా వారు చేస్తున్నది అక్రమమే అని తేలడంతో సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదు చేయడంతో నల్లగొండ వన్ టౌన్ పరిధిలో మూడు, టూటౌన్ పరిధిలో నాలుగు, మునుగోడులో రెండు, తిప్పర్తిలో ఐదు ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, క్లినిక్‌లపై కేసులు నమోదు చేశారు.

కళాశాలల ఏర్పాటు కలేనా?

- కొండమల్లేపల్లిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల కోసం ఏండ్లుగా నిరీక్షణ
- చదువులకు దూరమవుతున్న పేద విద్యార్థులు

నాలుగు రోడ్ల కూడలైన కొండమల్లేపల్లి పట్టణం దినదినాభివృద్ధి చెంతుతున్నది కానీ విద్యా అవకాశాల కల్పనలో వెనుకబడింది. పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు ఏండ్ల తరబడి కలగానే మిగిలిపోయింది. ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.

–కొండమల్లేపల్లి, మే 17

మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న కొండమల్లేపల్లి పట్టణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016 సంవత్సరంలో 26 గ్రామ పంచాయతీలతో కలిసి మండలంగా ఏర్పాటైంది. హైదరాబాద్, నాగార్జునసాగర్, కోదాడ, జడ్చర్ల జాతీయ రహదారి కావడంతో చుట్టుపక్కల నాంపల్లి, గుర్రంపోడు, పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి, చింతపల్లి, నేరేడుగొమ్ము మండలాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఇక్కడి పాఠశాలలోనే విద్యార్థులు అభ్యసించేందుకు వస్తుంటారు. కొండమల్లేపల్లి మండల పరిధిలో రెండు జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎస్సీ, బీసీ, మైనారిటీ, కస్తూర్బా గాంధీ పాఠశాలలు, పట్టణంలో ఐదుకు పైగా ప్రైవేట్ పాఠశాలలు ఉండగా దాదాపు వెయ్యికి పైగా విద్యార్థులు పదో తరగతి చదువుతుంటారు. ఒక్క కొండమల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే 250 మందికిపైగా పదో తరగతి విద్యార్థులు చదువుతుంటారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు కొండమల్లేపల్లి పట్టణంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లలేక, ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారిస్తే అనేక మంది నిరుపేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కొండమల్లేపల్లి పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల

చాలా ఇబ్బందులు పడుతున్నాం

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. జూనియర్ కళాశాల లేకపోవడం వల్ల నల్లగొండ, దేవరకొండ, హైదారాబాద్‌కు వెళ్లి చదువుకోవాల్సి వస్తున్నది. ప్రైవేట్ కళాశాలల్లో చదువాలంటే ఫీజులు లక్షల్లో ఉన్నాయి. ఇక్కడే ప్రభుత్వ కళాశాలలు ఉంటే సమయంతోపాటు మాలాంటి నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

-బొడ్డుపల్లి స్పందన, పదో తరగతి విద్యార్థిని, గుమ్మడవెల్లి

నాలుగైదు మండలాల విద్యార్థులకు ప్రయోజనం

కొండమల్లేపల్లిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తే నాలుగైదు మండలాల విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. కళాశాలలు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా పేద విద్యార్థుల ఉన్నత చదువులు కొనసాగే విధంగా కళాశాలలు ఏర్పాటు చేయాలి.

-రమావత్ లక్ష్మణ్‌నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

ఉన్నత చదువులకు దూరమవుతున్నారు..

కొండమల్లేపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం దాదాపు 1000 మంది 10వ తరగతి, 500 మంది ఇంటర్ పాస్ అవుతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువులు ఆపేయాల్సిన పరిస్థితి ఉంది.

- కర్నెకంటి రజనీకాంత్,
తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్
దేవరకొండ కన్వీనర్